
# ✻ లాకప్ మరణాలు ✻

భీమారావుకి చాల అవమానంగా ఉంది. అతని మనసు దుఃఖంతో చాల భారంగా తయారైంది.

"ఊహు... ఉహు... ఉహు..." అని కుమిలి కుమిలి ఏడ్చి చొక్కా ఎత్తి కళ్ళు తుడుచుకున్నాడు.




ఎదురుగా అద్దంలో ఉన్న అతని ప్రతిబింబం అతన్ని చూసి బండబూతులు సినిమాల్లో మాదిరిగా తిట్టింది.

"ఇంత అవమానాన్ని భరిస్తూ ఇంకా బతికున్నావేం?... ఎందులోనైనా పడి ఛావరాదా... థూ..." అంటూ ఉమ్మూసింది.

భీమారావు చొక్కా ఎత్తి మొహం తుడుచుకున్నాడు.

భీమారావు ఇంతగా బాధపడేంత అవమానం అతనికేం జరిగింది?

భీమారావు ప్రస్తుతం వయసు ముప్పై సంవత్సరాలు. అతనికి చిన్నప్పటినుండి కసరత్తులు చేసి కండలు పెంచడం అంటే తగని ఇష్టం. అంచేత కసరత్తులు బాగా చేసి కోళ్ళూ, మేకలూ బాగా మేసేవాడు. అతనిలా తిండి తింటుంటే జీతం సరిపోట్లేదని తను చేసే గవర్నమెంటాఫీసులో ఉద్యోగం కాక సాయంత్రం నుండి ఒక ప్రైవేటు కంపెనీలో లెక్కలు రాయడానికి వెళ్లేవాడు అతని తండ్రి.

కండలు పెంచడంతో బాటు అతనికి కుస్తీ పోటీల మీద మోజు పుట్టింది. తను కూడా దారాసింగంతటివాడు కావాలని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా కుస్తీ ఫైల్ మాన్ మస్తాన్ సాబ్ దగ్గర కుస్తీ పట్లకి సంబంధించి తర్ఫీదు పొందాడు. అటు తరువాత అతను కుస్తీ పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు.

త్వరలోనే అతను హైదరాబాద్‌లో కుస్తీ ఛాంపియన్‌గా తయారయ్యాడు. ప్రతి సంవత్సరం లాల్ బహదూర్ స్టేడియంలో జరిగే కుస్తీ పోటీల్లో భీమారావే ప్రథమంగా వచ్చి "బస్తీమే కుస్తీ బాద్‌షా" టైటిల్‌ని దక్కించుకునేవాడు. కానీ ఈ సంవత్సరం కలకత్తానుండి ఒక ముసుగు కుస్తీవీరుడు వచ్చి లాల్‌బహదూర్ స్టేడియం సెంటర్లో నిలబడి తన తొడ మాత్రం కనబడేలా ముసుగు కాస్త ఎత్తి తర్వాత ఆ తొడకొట్టి "నన్నెవడైనా కుస్తీలో చిత్తు చేస్తే నేనే ఈ ముసుగు తీస్తాను... అంతదాక తియ్యను" అంటూ సవాల్ చేశాడు.

అది వింటూనే అక్కడున్న వస్తాదులంతా నవ్వొచ్చి నవ్వి నవ్వి... ఆనక నవ్వలేక గిలగిల్లాడిపోయారు.

"పోరా బద్మాష్... నువ్వు ముసుగు తియ్యకుండా అలానే ఉంటే ఉక్కిపోయి చస్తావ్ ... మాకేం?" అనుకున్నారు.

కానీ భీమారావుకి మాత్రం అది వినగానే ఆవేశం వచ్చింది. అతని ముక్కు పొంగించాడు. తర్వాత కండలు పొంగించాడు.

అసలు ఎవరైనా ఛాలెంజ్ చేసిన తర్వాత కుస్తీ పట్టకపోతే ఏమైనా బాగుంటుందా?...

అంచేత ముసుగు కుస్తీ వీరుడితో భీమారావు కుస్తీకి తలపడ్డాడు.

ఏం లాభం?...

ఆ ముసుగు కుస్తీ వీరుడు పరుపులు కుట్టేవాడు దూది ఏకినట్టు భీమారావుని ఏకిపారేశాడు.

అంతే... "బస్తీ మే కుస్తీ బాద్‌షా" టైటిల్‌ని ఆ కలకత్తా ముసుగు కుస్తీ వీరుడు కొట్టేశాడు. దాంతో అయిదు సంవత్సరాలుగా ఆ టైటిల్‌ని చేజిక్కించుకుంటూ వచ్చిన భీమారావుకి తలకొట్టేసినట్టయింది. "నాకు ఆత్మహత్యే శరణ్యం... ఈ అవమానాన్ని నేనింక భరించలేను" అనుకున్నాడు భీమారావు.

అలా అనుకున్న తడవుగా భీమారావు ట్యాంక్‌బండ్ వెళ్ళి అక్కడినుండి

హుస్సేన్ సాగర్‌లో దూకబోయాడు. కానీ ఆ టైంలో ఎక్కడినుండి వచ్చాడో కాని ఒక వ్యక్తి రివ్వున వచ్చి భీమారావుని పట్టుకున్నాడు. నీళ్లలోకి దూకకుండా.

"ఏంటయ్యా నీ పద్ధతి. నువ్వింత ఎత్తు నుండి చెర్లోకి దూకితే చేపలూ, కప్పలూ చావవూ?... అయినా ఆత్మహత్య చేస్కోడం నేరం తెల్సా?... నువ్వు చెర్లో దూకితే పోలీసులొచ్చి రక్షించి ఆనక నిన్ను బొక్కలో తోసేస్తారు తెల్సా?..." అన్నాడు అతను.

"మరైతే ఎలాగా?" దీనంగా మొహంపెట్టి అడిగాడు భీమారావు.

"నీకు చావడమే కదా కావాల్సింది... ఆత్మహత్య చేస్కోబోతే పోలీసులు పట్టుకుని లాకప్‌లో పెట్టేస్తారు. తర్వాత నిన్ను చావబాది వాళ్లే పైకి పంపిస్తారు... చూశావా ఎంత తేలికో..." అన్నాడతను కులాసాగా నవ్వేస్తూ.

భీమారావు నాలుక కొరుక్కున్నాడు.

"అలాగా?... హర్రె! నాకీ ఆలోచనే తట్టలేదు..." అని అతని గెడ్డం క్రింద కండలు తిరిగిన చేత్తో ఒక్కటిచ్చాడు. ఆ దెబ్బకి అతను మూర్ఛబోయాడు. భీమారావు ఆ వ్యక్తి వేళ్లకున్న ఉంగరాలు, చేతికున్న వాచీ, జేబులోని పర్సు తీస్కుని ఉడాయించాడు.

భీమారావు వెళ్ళిపోయిన పది నిమిషాలకి ఆ వ్యక్తికి తెలివి వచ్చింది. తెలివొచ్చిన వెంటనే చేతి వేళ్లని చూస్కుని ఘొల్లుమన్నాడు, రిస్టువంక చూస్కుని గుండెలు బాదుకున్నాడు, జేబు తడుముకుని పర్సు చేతికి తగలక "బేర్‌ర్" మన్నాడు.

వెంటనే పోలీసు స్టేషన్‌కి పరిగెత్తి కంప్లైంట్ ఇచ్చాడు.

""వాడు కుస్తీ ఛాంపియన్ భీమారావులా ఉన్నాడండీ..." అంటూ ఘొల్లుమన్నాడు ఇన్‌స్పెక్టర్ సీతారాం ముందు.

భీమారావు ఇంట్లో కూర్చుని పోలీసుల కోసం ఎదురుచూడసాగాడు. అతను ఎక్కువ సేపు ఎదురు చూడాల్సిన పనిలేకుండా ఒక గంటలో పోలీసులు వచ్చారు. రాగానే గబగబా మంచం కింద చూశారు. అల్మారాల్లో వెతికారు... టేబులు సొరుగులు లాగి చూశారు.

"ఏంటూ సినిమా పోలీసు వేషాలు?... నేనెదురుగుండా ఉంటే నాకోసం టేబులు సొరుగుల్లో, అల్మారాల్లో వెతుకుతారేం?" అంటూ చిరాకుగా చూస్తూ పోలీసుల్ని అడిగాడు భీమారావు.

"నోర్మయ్... నువ్వు దొంగిలించిన ఉంగరాలు, వాచి, పర్సుకోసం వెతుకుతున్నాం... చెప్పు... అవన్నీ ఎక్కడపెట్టావ్?..." అన్నారు పోలీసులు కోపంగా.
"నేన్చెప్పన్గా... హిహి..." అంటూ నవ్వాడు భీమారావు.
పోలీసులు భీమారావుని పోలీసు స్టేషన్కి లాక్కెళ్లారు.
"చెప్పవయ్యా... దొంగిలించినవి ఎక్కడ పెట్టావ్?" ఇన్ స్పెక్టర్ సీతారాం కోపంగా అరుస్తూ అడిగాడు.
"హమ్మా!... అశ, దోసె, అప్పడం, వడ... నేను చెప్పనుగా!!..." చంక కింద కొట్టుకుంటూ అన్నాడు భీమారావు.
ఇన్ స్పెక్టర్ సీతారాం కోపంతో ఊగిపోయాడు.
"ఒరేయ్... వీడిని లాకప్‌లో పడెయ్యండిరా.." అంటూ అరిచాడు.
భీమారావుకి కావల్సింది కూడా అదే!... సంతోషంతో "ఫుయ్య్..." అంటూ విజిలేశాడు.
పోలీసులు భీమారావుని లాకప్‌లో పడేశారు. కానీ భీమారావు ఊహించిన విధంగా ఏమీ కాలేదు. పోలీసులు ఎవరి పనులు వారు చూస్కోసాగారు. భీమారావుకి ఎదురు చూసి ఎదురుచూసి విసుగొచ్చింది.
"ఏంటీ?... నన్నిలా లాకప్‌లో పారేసి ఏం చెయ్యకుండా కూర్చోడంలో మీ ఉద్దేశం ఏంటి?" అంటూ గట్టిగా అరిచాడు.
"ఏం చెయ్యకుండా వదిలెయ్యడం ఏంటి నీ బొంద. నీకు తిండిలేకుండా రెండ్రోజులు మాడుస్తాం!... అప్పుడు నువ్వేచెప్తావ్... దొంగిలించినవి ఎక్కడ దాచావో..." అన్నాడు సీతారాం.
"నేను తిండిలేకుండా ఉండగల్ను..." అన్నాడు భీమారావు.
"ఎలా ఉండగలవో చూస్తాం."
"అంతేగానీ నన్ను కొట్టరా... ఏం చెయ్యరా?"
"ఊహూ..."
"లాకప్‌లో కొట్టి చంపేస్తారని విన్నానే!!" ఆశ్చర్యంగా అన్నాడు భీమారావు.
"నువ్వు విన్నది నిజమే గానీ... మా పోలీస్ స్టేషన్లో అలా జరగదు ... మా ఇంటి పేరు 'జె'. 'జె' ఇ అంటే ఏంటో తెల్సా?"
భీమారావు తల అడ్డంగా ఊగించాడు.
"జె – అంటే జాలిగుండెల... కాబట్టి, నేనేం కొట్టి చంపను... తెల్సా?" చెప్పాడు సీతారాం.
భీమారావు నెత్తి కొట్టుకున్నాడు.

"అదేంటండీ... మీరలా చెయ్యకపోతే ఎంత నామోషీ!!... ఛీఛీ..." అన్నాడు మొహం చిట్లిస్తూ.

"నాకేం నామోషీ కాదు" అన్నాడు సీతారాం.

"అందరూ మీరో పనికిమాల్న పోలీసు ఆఫీసరని అంటారు... ఛీ యాక్." రెచ్చగొడ్తూ అన్నాడు.

"అంటే అన్నార్లే..." నిర్లక్ష్యంగా అన్నాడు సీతారాం.

"యావండేవండేవండీ... ప్లీజ్ ఇన్‌స్పెక్టర్ గారూ... మీరలా అవకండీ... అందర్లాగే మీరు ఉండండి సార్..." అంటూ బతిమిలాడాడు భీమారావు.

"వీల్లేదయ్యా... చెప్పాగా మా ఇంటి పేరు జాలిగుండెల అని" అన్నాడు జాలిగుండెల సీతారాం.

సరిగ్గా అప్పుడే మరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జగ్గారావు సీతారాం దగ్గరికి వచ్చాడు.

ఇద్దరూ కుశల ప్రశ్నలు వేస్కున్నాక సీతారాం అన్నాడు: "నువ్వీ మధ్య భలే పాపులర్ అయ్యావే జగ్గారావ్... ప్రతిరోజూ నీ పేరు పేపర్లో పడ్తుంది."

జగ్గారావు గర్వంగా తల పంకించాడు.

"మరే మనుకున్నావ్?... ఎవడైనా లాకప్‌లో పడ్డాడో... చచ్చాడన్న మాటే..." అన్నాడు. ఆ తర్వాత సీతారాం వంక జాలిగా చూస్తూ అన్నాడు: "అయినా నువ్వేంటి ఇలా?... ఇప్పటిదాకా ఒక్కడ్ని కూడా చంపలేదు. మన డిపార్ట్‌మెంట్ పరువు తీసేస్తున్నావ్... డిపార్ట్‌మెంట్లో అసమర్ధుడిగా పేరుబడిపోతున్నావ్... త్వరగా ఎవడో ఒకడ్ని చంపు!"

"మా ఇంటి పేరు జాలిగుండెల వారు ... నేనలా చేస్తే బాగుంటుందంటావా?" సందేహిస్తూ అడిగాడు.

"నువ్వలా పిచ్చి సందేహాలు పెట్టుకుంటే లాభం లేదు... మన తర్వాతి ప్రమోషన్‌కి ఎంతమందిని లాకప్‌లో వేసి చంపామన్నది కూడా చూస్తారని అందరూ అనుకుంటున్నారు."

సీతారాం తెల్లబోయి చూశాడు.

"హమ్మో!... అలాగయితే నాకు ప్రమోషన్ రాదు – నేను త్వరపడాల్సిందే... ఏయ్ వన్నాట్ ఫోర్, హండ్రెడ్ లెవన్..." అంటూ అరిచాడు.

ఇద్దరు బక్క కానిస్టేబుల్స్ వచ్చారు.

"లాకప్‌లో ఉన్న ఆ వస్తాదుగాడ్ని చచ్చేదాకా కొట్టండి..." సంబరంగా అరిచాడు సీతారాం.

పోలీసు లిద్దరూ తాళం తీసి లోపలికి - భీమారావు దగ్గరికి వెళ్ళారు. ఆ మర్నాడు న్యూస్ పేపర్లలో లాకప్ మరణం గురించి వార్త పడింది. కానీ మరణించింది భీమారావు కాదు. ఆ వస్తాదుని కొట్టీ కొట్టీ అలిసిపోయిన ఆ బక్క కానిస్టేబుళ్ళే చచ్చూరుకున్నారు!
పోలీసు దెబ్బలకి కండలు మరికాస్త గట్టిపడిన భీమారావు లాకప్‌లోంచి తప్పించుకుని ముసుగువీరుడు బసచేసిన హోటల్‌కి వెళ్ళి వాడిని నడి వీధిలోకి లాగి చిత్తుకింద తన్ని, మళ్లీ 'బస్తీమే కుస్తీ బాద్‌షా" టైటిల్ సంపాదించుకున్నాడు.

* * *